

9న వికారాబాద్‌కు అమిత్‌షా

వికారాబాద్, మే 4(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈనెల 9న వికారాబాద్ జిల్లాకు రానున్నారు. చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరపున జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బహిరంగసభలో ప్రసంగించనున్నారు. అమిషా బహిరంగ సభ కోసం ఎస్‌ఏపీ కళాశాల గ్రౌండ్, బ్లాక్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మద్గుల్ చిట్టంపల్లి వద్ద మోదీ బహిరంగ సభ కోసం పరిశీలించిన స్థలంలో అమిత్‌షా సభ నిర్వహించే విషయాన్ని కూడా పరిశీలించేందుకు ఆదివారం రాష్ట్ర పార్టీ నాయకుల బృందంవికారాబాద్‌కు రానున్నట్లు సమాచారం.



వామ్మో..ఎండలు

- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వికారాబాద్ జిల్లాలో ఆల్‌టైం రికార్డు నమోదు
- బంట్వారంలో 45.7 డిగ్రీలు నమోదు
- అల్లాడిపోతున్న ప్రాణులు

ఆంధ్రజ్యోతి,రంగారెడ్డిఅర్బన్/ఇబ్రహీంపట్నం, మే 4: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎండలు మండుతున్నాయి. వికారాబాద్ జిల్లాలో శనివారం సూర్యుడు ఉగ్రరూపం దాల్చడంతో జిల్లాలో ఆల్‌టైం రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వికారాబాద్ జిల్లా బంట్వారంలో అత్యధిక ఉష్ణోగ్రత 45.7 డిగ్రీల నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం, చిల్కూరు మృగవని పార్కు సమీపంలో 44.7 డిగ్రీలు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గండిమైసమ్మ-దూలపల్లి ఫారెస్ట్ అకాడమీ వద్ద 45.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కులకచర్ల మండలం, పుట్టపహాడ్‌లో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మర్పల్లిలో44.7 డిగ్రీలు, బంట్వారం మండలం, నాగారంలో 44.5డిగ్రీలు, వికారాబాద్‌లో 43.9 డిగ్రీలు, చౌడాపూర్‌లో 43.8 డిగ్రీలు, కోట్‌పల్లిలో 43.8, నవాబ్‌పేట్‌లో 43.8 డిగ్రీలు, తాండూరులో 43.7 డిగ్రీలు, బషీరాబాద్ మండలం, కాశీంపూర్‌లో 43.7 డిగ్రీలు, కులకచర్ల మండలం, ముజాహిద్‌పూర్‌లో 43.4 డిగ్రీలు, యాలాల్ మండలం, ఏఆర్‌ఎస్‌లో 43.4 డిగ్రీలు, దుద్యాల్‌లో 43.4 డిగ్రీలు, దౌల్తాబాద్‌లో 43.2, ధారూరులో 43.1 డిగ్రీలు, బషీరాబాద్‌లో 43.1, మోమిన్‌పేట్‌లో 43.1 డిగ్రీలు, కొడంగల్‌లో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యాలాల్ మండలం, దౌలాపూర్‌లో 43.0 డిగ్రీలు, పెద్దేముల్‌లో 43.0 డిగ్రీలు, పూడూరుమండలం, పెద్ద ఉమ్మెంతాల్‌లో 43.0 డిగ్రీలు, పూడూరు మండలం, మన్నెగూడలో 43.0 డిగ్రీలు, యాలాల్‌లో 43.0, పరిగి మండలం, రాపోల్‌లో 42.8 డిగ్రీలు, వికారాబాద్ మండలం, మద్గుల్ చిట్టంపల్లిలో 42.3 డిగ్రీలు, బొంరాస్‌పేట్‌లో 42.2 డిగ్రీలు, దోమలో 42.1 డిగ్రీలు, వికారాబాద్ మండలం, మదన్‌పల్లిలో 42.1 డిగ్రీలు, పరిగిలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యాన్ని పెంచుకోండి

నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఫోరం చైర్మన్ అనిల్ డి.సహస్రబుద్ధి




మాట్లాడుతున్న ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్ధి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 4: అధునాతన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సౌకర్యాలు, ప్రయోగశాలలను ఉపయోగించుకొని అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో నైపుణ్యాన్ని పెంచుకోవాలని నేషనల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఫోరం (ఎన్‌ఈటీఎఫ్), నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ), ఈసీ నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్ధి విద్యార్థులకు సూచించారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యాసంస్థ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు కేవలం డిగ్రీలుంటే సరిపోదని.. నిత్యం పరిశోధనలు చేస్తూ అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. అందుకు అనుగుణంగా అయా విద్యాసంస్థలు తమ వంతుగా తగు వసతులు, ఆ వాతారణం కల్పించాలని సలహా చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. పరిశోధనలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అయన అభినందించారు. అనంతరం మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన ప్రతిష్టాత్మక ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఫెడరేషన్ సెంటర్ (ఐపీఎఫ్సీ)ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గురునానక్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ సర్థార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, ఎండీ హెచ్‌ఎస్ సైనీ, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకట్‌రావు, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనాథరెడ్డి, జాయింట్ డైరెక్టర్ పి.పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్లు రిషిసాయల్, కేదార్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో నేడు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్ షో



శంషాబాద్, మే 4 : శంషాబాద్‌లో నేడు సీఎం రేవంత్‌రెడ్డి రోడ్‌షో నిర్వహిస్తున్నారని, దానిని విజయవంతం చేయాలని తెలంగాణ పాడి పరిశ్రమల అభివృద్ధి చైర్మన్ జ్ఞానేశ్వర్ అన్నారు. శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు శంషాబాద్‌లో రోడ్ షోకు సీఎం హాజరవుతారని ఆయన తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి మద్దతుగా సీఎం రేవంత్ రోడ్ షో నిర్వహిస్తున్నట్టు జ్ఞానేశ్వర్ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. హైదరాబాద్ నుంచి ఆరాంఘర్ మీదుగా విమానాశ్రయానికి శంషాబాద్ ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నుంచి వెళ్లాలి. ఫ్లై ఓవర్ పక్కనున్న సర్వీసు రోడ్డును మూసేస్తారు. ఎయిర్‌పోర్ట్ నుంచి, అలాగే మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నగరం వైపు వెళ్లేవారు శంషాబాద్ ఫ్లై ఓవర్‌పై నుంచే వెళ్లాలి. బ్రిడ్జి పక్కనున్న సర్వీసు రోడ్డు ఉపయోగించొద్దు. ఔటర్ రింగు రోడ్డును సైతం ఉపయోగిచుకోవచ్చని సూచించారు. షాబాద్ నుంచి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు ఔటర్ సర్వీసు రోడ్డును వినియోగించుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.



లోక్‌సభ ఎన్నికలను పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. నువ్వా..నేనా అన్న విధంగా ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఎన్నికల ప్రచారం ఊపందుకోవడంతో పాటు గడువు సమీపిస్తుండడంతో ఉపాధి కోసం వలస వెళ్లిన గ్రామీణ ఓటర్లపై దృష్టి సారించాయి. ఎంత మంది ఓటర్లు ఎక్కడెక్కడ ఉన్నారని ఆరా తీస్తున్నారు. పార్టీల నేతలు ఆయా గ్రామాల ముఖ్య నాయకులతో వలస వెళ్లిన వారికి ఫోన్ల మీద ఫోన్లు చేయిస్తున్నారు.

వలస ఓటర్లపై నజర్!

ఓటర్లతో పార్టీల నాయకుల సంప్రదింపులు

- రానుపోనూ ఖర్చులు మావే.. పైఖర్చులు కూడా ఇస్తాం..
- హామీ తీసుకుని ముందుగానే ఫోన్ పే... గూగుల్ పేలో చెల్లింపులు

ముందుగానే పంపిణీ

ముందుగానే డబ్బులు పంపిస్తే ఓటర్లు తమకు ఓట్లు వేస్తారని, లేకపోతే వేయకపోవచ్చని భావించి ముందుగానే డబ్బులు ముట్టచెబుతున్నారు. ఓటర్ల సంఖ్య ఆధారంగా ఒక్కో ఓటరుకు రాకపోకలకయ్యే ఖర్చులతో పాటు అదనంగా రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు అదనంగా పంపిస్తున్నట్లు తెలుస్తోంది. జీవనోపాధి పనుల కోసం గ్రామాల నుంచి దూర ప్రాంతాలకు వెళ్లిన వారు గ్రామాల్లో జరిగే ఎన్నికల్లో ఓటేసేందుకు వచ్చిన వారు తమకు వచ్చే కూలీ డబ్బులు నష్టపోకుండా చెల్లింపులు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి, వికారాబాద్, మే 4 : లోక్ సభ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కానుంది. ఒక్క ఓటుతో గెలుపొందిన, ఓటమి పాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. జీవనోపాధి కోసం హైదరాబాద్, ముంబయి, తదితర దూర ప్రాంతాలకు వెళ్లిన వారిని పోలింగ్ రోజు గ్రామాలు, పట్టణాలకు రప్పించి వారు ఓటు వేసే విధంగా ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించారు. అందుకే ఎన్నికల్లో ఓటరు జాబితాలో ఉండే ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల నేతలు ప్రయత్నం చేస్తారు. దూర ప్రాంతాల్లో ఉండే వలస ఓటర్లతో తమకు అనుకూలంగా ఓటు వేయించుకునేందుకు రోజూ ఫోన్ల మీద ఫోన్లు చేస్తున్నారు. జిల్లాలో పరిగి, కొడంగల్, తాండూరు, వికారాబాద్ నియోజకవర్గాలకు చెందిన వేలాది మంది హైదరాబాద్, మహబూబ్‌నగర్, పటాన్‌చెరు తదితర ప్రాంతాలతో పాటు పూణే, ముంబయి వంటి ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. చేవెళ్ల లోక్‌సభ ఎన్నిక నువ్వా- నేనా అన్న విధంగా హోరాహోరీగా కొనసాగే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రధాన పార్టీల నాయకులు దూరంగా ఉన్న వలస ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడ ఉన్నా పోలింగ్‌కు ఒకరోజు ముందుగానే స్వగ్రామాలకు రప్పించి తమకు అనుకూలంగా ఓటు వేయించుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు పోటీ పడుతున్నారు.

వలస ఓటర్లపై ప్రధాన పార్టీల గురి...



దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల ఓట్లు తమకే పడాలన్న లక్ష్యంతో ప్రధాన పార్టీల నాయకులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితాల ఆధారంగా గ్రామాల వారీగా దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల లిస్టులను తయారు చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను పోలింగ్‌కు ఒకటి, రెండు రోజులు ముందుగానే స్వగ్రామాలకు చేరుకోవాలని సూచిస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన వారు ఉంటే ప్రైవేట్ వాహనం అద్దెకు తీసుకుని రావాలని, లేనిపక్షంలో ఇక్కడి నుంచి పంపిస్తామంటూ వారికి హామీ ఇస్తున్నారు. స్థానికంగా ఉండే గ్రామ పెద్దలతో మాట్లాడి ఒక్కో కుటుంబంలో ఎంత మంది ఓటర్లు గ్రామాలకు వస్తున్నారనేది తెలుసుకుని అందుకు సరిపడా డబ్బులు ఫోన్ పే లేదా గూగుల్ పే చేస్తున్నారు. రవాణా ఖర్చులకు తోడు వారు ఇక్కడ ఉండే రెండు, మూడు రోజుల పని రోజులకు సంబంధించిన కూలీ డబ్బులు కూడా వారికి గిట్టుబాటయ్యేలా పంపుతున్నారు.

వలస ఓటర్ల ప్రసన్నం కోసం విశ్వ ప్రయత్నాలు

ఉద్యోగ, ఉపాధి పనులకు దూరంగా వెళ్లిన ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. దూరంగా ఉండే వారిని రోజూ ఫోన్‌లో పలకరిస్తూ తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేసేలా ప్రయత్నిస్తున్నారు. ఉన్న చోటు నుంచి గ్రామాలకు వచ్చి వెళ్లడానికయ్యే ఖర్చులన్నీ తమవేనని, మిగతా ఖర్చులు కూడా ఇస్తామంటూ వలస ఓటర్లకు ఎరవేస్తున్నారు. స్థానికంగా ఉండే వారి కుటుంబ సభ్యులు, బంధువుల ద్వారా కూడా వారితో ఫోన్లలో మాట్లాడుతూ ముందే హామీ తీసేసుకుంటున్నారు. రాకపోకలకయ్యే ఖర్చులతో పాటు ఇతర ఖర్చులు కూడా ఇస్తామని ముందే హామీ ఇస్తున్న నాయకులు తాము సూచించిన అభ్యర్థికే ఓటు వేయాలని కోరుతున్నారు. ఓటర్లు వేరే వైపు దృష్టి సారించకుండా రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులను కూడా కలిపి ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో వారు నిమగ్నమయ్యారు. ప్రతి ఓటు కీలకం కావడంతో ప్రతి ఓటరును ప్రసన్నం చేసుకునేందుకు ఎవరికి వారు విశ్వప్రయత్నం చేస్తున్నారు.

రవాణా ఖర్చులతో పాటు కూలి డబ్బులు

ఎన్నికల్లో ఒక్కో ఓటు కీలకం కావడంతో దూర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను గ్రామాలకు రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇక్కడి నుంచి వేరే ప్రాంతాలకు జీవనోపాధి కోసం వలస వెళ్లిన ఓటర్లను పోలింగ్‌కు రప్పించేందుకు సమన్వయం చేసుకుని వారితో తమకు అనుకూలంగా ఓట్లు పడే విధంగా ప్రయత్నించే బాధ్యతను ప్రధాన పార్టీలు ఆయా గ్రామాల్లోని తమ పార్టీ నాయకులకు అప్పగించారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, పటాన్‌చెరు తదితర ప్రాంతాల్లో ఉండే వలస ఓటర్లకు ఒక్కో ఓటరుకు రవాణా ఖర్చులు, ఇతర ఖర్చులుకూడా ముట్టజెబుతున్నట్లు తెలుస్తోంది. ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉంటే వారిని రప్పించేందుకు ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. అదే ముంబాయి, పూనే, సూరత్‌లో ఉండే ఓటర్లను రప్పించేందుకు ఒక్కో కుటుంబానికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వరకు ఖర్చుల కింద పంపిస్తున్నట్లు తెలుస్తోంది. రైలు, బస్సు రాకపోకల కోసమయ్యే రవాణా ఖర్చులతో పాటు ఇతర ఖర్చులకు కూడా డబ్బులు పంపిస్తున్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ హోం ఓటింగ్ : కలెక్టర్



హోం ఓటింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి శశాంక

రంగారెడ్డి అర్బన్, మే 4 : ఇంటినుంచి బయటకు రాలేని వృద్ధులు, దివ్యాంగుల కోసం ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటుహక్కును వినియోగించుకునే అవకాశాన్ని కల్పించింది. శనివారం భారీ బందోబస్తు మధ్య నిర్వహించిన ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి శశాంక పరిశీలించారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని హైదర్‌గూడ గ్రామం, అత్తాపూర్ వాసుదేవ్ నగర్‌లో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ సమక్షంలో హోంఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శనివారం ప్రారంభమైన హోం ఓటింగ్ ప్రక్రియ రేపటి వరకు కొనసాగుతుందన్నారు. మొదటి రోజున చేవెళ్ల పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల బృందాలు ఆయా రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఓటును సేకరించారని తెలిపారు. హోం ఓటింగ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికార బృందాల పని తీరును నిశితంగా పర్యవేక్షించినట్టు చెప్పారు. హోం ఓటింగ్ సదుపాయంతో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులకు ఎంతో వెసులుబాటు లభించిందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 1,115 మంది ఓట్ ఫ్రం హోం సదుపాయాన్ని వినియోగించుకోనుండగా, వీరిలో 85 సంవత్సరాలకు పైబడిన సీనియర్ సిటిజన్లు 695 మంది, దివ్యాంగ ఓటర్లు 420 మంది ఉన్నారని కలెక్టర్ తెలిపారు. చేవెళ్ల పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో మొత్తం 54 బృందాలు హోం ఓటింగ్‌లో పాల్గొంటున్నాయని, ప్రతి బృందంలో పీవో ఓపీఓతో పాటు మైక్రో అబ్జర్వర్, వీడియో గ్రాఫర్, పోలీస్ సిబ్బంది ఉన్నారని తెలిపారు. హోం ఓటింగ్ కోసం అర్హత పొందిన వారికి అధికారుల బృందం వచ్చే సమాచారాన్ని ముందస్తుగానే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా తెలియజేస్తున్నారన్నారు. హోం ఓటింగ్ సమాచారాన్ని ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులకు ముందస్తుగానే తెలియజేయడంతో పలుచోట్ల వారు కూడా పరిశీలిస్తున్నారని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట రాజేంద్రనగర్ ఏఆర్వో వెంకట్‌రెడ్డి ఉన్నారు

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలి

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జాగ్రత్తగా నిర్వహించాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు వీలుగా రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఆయన శనివారం పరిశీలించారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ సెగ్మెంట్ పోస్టల్ బ్యాలెట్ సేకరణ కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి, పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతగా జరిగేలా చూడాలని, ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు అనుగుణంగా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఓటరు హెల్ప్‌లైన్ కౌంటర్ వద్దనే ఓటరు జాబితాలోని క్రమసంఖ్య, పార్ట్ నెంబర్‌ను చెక్ చేసుకోవాలని అన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే ఉన్నతాధికారులను సంప్రదించాలని, అనవసర తప్పిదాలకు పాల్పడకూడదని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు మే 8వ తేదీ వరకు నిర్వహించే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి తెలిపారు. కలెక్టర్ వెంట రాజేంద్రనగర్ ఏఆర్వో వెంకట్‌రెడ్డి, సంబంధిత అధికారులున్నారు.

పోలింగ్ ప్రక్రియపై అవగాహన కలిగి ఉండాలి

పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శశాంక సూచించారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు, ఏపీవోలకు రాజేంద్రనగర్ టీఎస్‌ఐఆర్‌డీ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, రాజకీయ నాయకుల సమక్షంలో శశాంక ఈటీపీబీఎస్ ఓటింగ్ బాక్స్‌కు సీల్ వేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శనివారం పూర్తి చేశారు.

అసెంబ్లీవారీగా ఈవీఎంల కేటాయింపు ఇలా

అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చూస్తే.. 305 పోలింగ్ కేంద్రాలు కలిగి ఉన్న పరిగి అసెంబ్లీ సెగ్మెంట్‌కు 1,145 బ్యాలెట్ యూనిట్లు, 381 కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా లెక్కిస్తూ 427 వీవీ ప్యాట్లు కేటాయించామని కలెక్టర్ శశాంక తెలిపారు. 284 పోలింగ్ కేంద్రాలు కలిగిన వికారాబాద్ సెగ్మెంట్‌కు 1,065 బీయూలు, 355 సీయూలు, 397 వీవీ ప్యాట్లు, 277 పోలింగ్ కేంద్రాలున్న తాండూర్‌కు 1,038 బీయూలు, 346 సీయూలు, 387 వీవీ ప్యాట్లు, 357 పోలింగ్ కేంద్రాలు గల మహేశ్వరం నియోజకవర్గానికి 2,014 బీయూలు, 346 సీయూలు, 387 వీవీ ప్యాట్లు, 543 పోలింగ్ కేంద్రాలు కలిగిన రాజేంద్రనగర్ శాసనసభ నియోజకవర్గానికి 2,037 బీయూలు, 678 సీయూలు, 760 వీవీప్యాట్లు, 633 పోలింగ్ కేంద్రాలు కలిగిన శేరిలింగంపల్లి శాసనసభ నియోజకవర్గానికి 2,374 బీయూలు, 791 సీయూలు, 886 వీవీప్యాట్లు, 298 పోలింగ్ కేంద్రాలు కలిగిన చేవెళ్ల నియోజకవర్గానికి 1,118 బీయూలు, 372 కంట్రోల్ యూనిట్లు, 417 వీవీ ప్యాట్ల చొప్పున ర్యాండమైజేషన్ జాబితా ప్రకారంగా కేటాయిస్తున్నామని ఆయన తెలిపారు.

వైభవంగా భద్రేశ్వరుడి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాండూరు, మే 4: తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సంస్కృతిని, సంప్రదాయాలబద్ధంగా పూజ కార్యక్రమాలు కొనసాగాయి. అంతకు ముందు బసవేశ్వరఆలయం నుంచి నగశ్వేర దేవాలయం,గాంధీచౌక్ మీదుగా భద్రేశ్వర్‌చౌక్ వరకు కలశం ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రథంపై కలశాన్ని ఆలంకరించారు. మంగళవాద్యాలు, కర్ణాటక రాష్ట్ర పురంతయ్యల విన్యాసాల నడుమ స్వామి వారిని గర్భగుడి నుంచి రథం వరకు తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. భద్రేశ్వర నామస్మరణతో తాండూరు పట్టణం మార్మోగింది. ఆలయ ఈవో శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, నేతృత్వంలో తాండూరు అర్బన్, రూరల్ సీఐ సంతోష్ కుమార్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు తాండూరుతో పాటు కొడంగల్, పరిగి, వికారాబాద్ ప్రాంతాల, చించోళి, కుంచారం, సేడం, గుర్మిటికల్, తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి జ్యోతి పద్మ

వికారాబాద్, మే 4: వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ సంక్షేమ అధికారి జ్యోతి పద్మ తెలిపారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్‌ల సాధికారత శాఖ, స్వీప్ సంయుక్తంగా వారికి కలెక్టరేట్‌లో లోక్‌సభ ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 13న జరిగే చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నిక ఉన్నందున వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్‌లు జిల్లావ్యాప్తంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద వీల్‌ఛైర్లు, ర్యాంప్‌ల సౌకర్యాలు కల్పించామని చెప్పారు. అదేవిధంగా వయోవృద్ధులు, దివ్యాంగులకు ఓటు వేయడానికి ఉచిత రవాణా సదుపాయంతో పాటు వీరికి సహాయం నిమిత్తం వలంటీర్లను నియమించినట్లు తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు పోలింగ్ బూత్‌లు వేర్వేరు వరుసల్లో ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్వీప్ జిల్లా నోడల్ అధికారి సత్తార్, షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి మల్లేశం, తెలంగాణ సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు మురారి, ట్రాంజెండర్స్ జిల్లా అధ్యక్షుడు హరిజన్ రమ్య, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ బలరాం, ట్రాన్స్‌జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మి, బాబు, జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మెరుపురి వెంకటేష్ పాల్గొన్నారు.



పెద్దేముల్: పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్న పోలీసులు

కొడంగల్: లోక్ సభ ఎన్నికల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతీఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భరత్‌రెడ్డి అన్నారు. అధికారులు శనివారం పోస్టల్ బ్యాలెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐతో పాటు పోలీస్ సిబ్బంది స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

తాండూరులో హోం ఓటింగ్ పూర్తి



తాండూరు: ఇంటి వద్ద ఓటింగ్ చేస్తున్న వృద్ధులు

తాండూరు: తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కి సంబంధించి నాలుగు రూట్లలో శనివారం హోం ఓటింగ్ పూర్తిచేశారు. ఫారం 12డి ద్వారా దరఖాస్తు చేసుకున్న 16మంది వయోవృద్ధులు, 25మంది దివ్యాంగులు కాగా మొత్తం 41 ఓటర్లకు గాను 40 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఫారం 12ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న పెద్దేముల్ మండలం ఓటరు ఒకరు వారం రోజుల కిందట మృతిచెందడంతో 40మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఆదివారం నుంచి పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు వారి ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో కమిషనింగ్ చేసి ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేస్తున్నట్లు తాండూరు సహాయ రిటర్నింగ్ ఎన్నికల అధికారి శ్రీనివాస రావు తెలిపారు.

పోస్టల్‌బ్యాలట్‌ను వినియోగించుకున్న ఉపాధ్యాయులు

పెద్దేముల్: ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగ, ఉపాధ్యాయులకు శుక్రవారం నుండి పోస్టల్‌బ్యాలట్ ప్రారంభమైంది. ఉద్యోగ, ఉపాధ్యాయులు వారి వీలును బట్టి పోస్టల్‌బ్యాలట్ ఉపయోగించుకుంటున్నారు. తాండూరు పట్టణంలోని నం 1 పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రంలో రెండవ రోజు శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయులు పోస్టల్‌బ్యాలట్‌ను ఉపయోగించుకున్నారు. పెద్దేముల్ మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సుమారు 30 మంది వారి ఓటుహక్కును వినియోగించుకున్నారు.



పెద్దేముల్: పోస్టల్‌బ్యాలట్ వేసిన ఉపాధ్యాయులు

కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

కొడంగల్, మే 4: కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి కొడంగల్ పట్టణానికి చెందిన నరహరి వశిష్ట మూడవ వర్ధంతిని పురస్కరించుకొని భక్తి గీతాలు, సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ఆలయాల భజన మండలి సభ్యులతో పాటు ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి సభ్యులు, తాండూర్ పోట్లి మహారాజ్ సంస్థాన్ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నరహరి వశిష్ట జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు శ్రీహరి వశిష్ట, మురారి వశిష్ట, ఎన్ఆర్ఐ కె.హరిప్రసాద్ వశిష్ట, మను మండ్ల అభిలాష్‌రెడ్డి, భవాని కృష్ణలు కళాకారులను ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన కళాకారుడు మహేశ్‌చారికి నరహరి వశిష్ట కుటుంబ సభ్యులు రూ.25వేలు విలువ గల తబలాను బహూకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన 70మంది కళాకారులకు ప్రముఖ పుణ్యక్షేత్రం పండరీపూర్ నుంచి తీసుకొచ్చిన తాళాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు నందారం శ్రీనివాస్, పాత కోట్ల గోపాల్, అక్కి శ్రీనివాసమూర్తి, రఘుమాస్టర్, డీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థచారి, ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి సభ్యులు డాక్టర్ హీరేలాల్, కొత్తూర్ పాండు రంగయ్య, తుకారం, బత్తుల మొగులయ్య, బాకారం సాయిలు, తాండూర్ పోట్లి మహరాజ్ సంస్థాన్ సభ్యులు, భజన మండలి మాస్టర్‌లు రాములు, శేఖర్, మనోజ్, సాయన్న, నిహార్, నాయకులు భాస్కర్, కుర్వ ఎల్లప్ప, తలారి బిచ్చప్ప పాల్గొన్నారు.



మాస్టర్ మహేశ్‌చారికి తబలాను బహూకరిస్తున్న ఎన్ఆర్ఐ కె.హరిప్రసాద్ వశిష్ట

బ్యూటీ పార్లర్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం



లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు

వికారాబాద్, మే 4: బ్యూటీ పార్లర్ కోర్సు నేర్చుకునే ఆసక్తిగల గ్రామీణ మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంబాబు తెలిపారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, చిలుకూర్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. మే 8వ తేదీ నుండి గ్రామీణ మహిళలకు శిక్షణ ఇవ్వబడుతుందని అన్నారు. మే 5 నుండీ8 వతేది వరకు సంస్థ కార్యాలయంలో లేదా సంస్థ సంచాలకులు రమేష్ 8500165190, 798195167 ద్వారా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కు చెందిన వారై ఉండాలన్నారు. వయస్సు 19 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల లోపు ఉండాలని, 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదవ తరగతి మెమో, రేషన్ కార్డ్, ఆధార్ కార్డ్ ధ్రువపత్రాలతో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, బ్యాంక్ పాస్ బుక్ ల జిరాక్స్ కాపిలు సమర్పించాలని తెలిపారు. ఉచిత శిక్షణతో పాటు శిక్షణ కాలంలో ఉచిత హాస్టల్ వసతి , భోజన సౌకర్యం యూనిఫాం, టూల్ కిట్స్ ఇవ్వడం జరగుతుందని ఆయన వివరించారు.

పెరిగిన నిమ్మకాయల ధరలు



మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన నిమ్మకాయలు

బషీరాబాద్, మే 4: ఎండలు రోజు రోజుకు భగ్గుమంటున్నాయి. బయటకు వెళ్లి వచ్చాక ఎండ నుంచి నిమ్మరసం తాగి ఉపశమనం పొందుతుంటారు. అయితే, మార్కెట్‌లో నిమ్మకాయల ధరలు అమాంతం పెరిగాయి. మార్కెట్‌లో వేసవికి ముందు రూ.10కి ఐదు నిమ్మకాయలు లభ్యమయ్యేవి. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.20కి పెద్దసైజు నిమ్మకాయలు మూడు, చిన్నసైజు ఉంటే నాలుగు మాత్రమే విక్రయిస్తున్నారు. దీంతో పెరిగిన ధరలతో సామాన్యులు సతమతమవుతున్నారు.

అక్రమ లేఅవుట్ ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి

మేడ్చల్ టౌన్, మే 4: మండలంలోని డబీల్‌పూర్ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్ చేసి విక్రయిస్తున్న ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను అడ్డుకోవాలని కోరుతూ పలువురు గ్రామస్తులు మేడ్చల్ సబ్‌రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పించారు. గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 112, 113లో కొందరు అక్రమంగా లేఅవుట్‌ను తయారుచేసి ప్లాట్లను విక్రయిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారని వారు ఆరోపించారు. ఈ లేఅవుట్‌కు సంబంధించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లను అధికారులు నిలిపి వేయాలని వారు కోరారు.

చివరి నిమిషంలో కేటీఆర్ రోడ్‌షో రద్దు

● నిరుత్సాహపడిన బీఆర్ఎస్ కేడర్.. ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రసంగం

మేడ్చల్ టౌన్, మే 4 : ఎన్నికల వేళ పార్టీ కేడర్‌లో జోష్ నింపాలన్న ఉద్దేశ్యంతో మేడ్చల్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌తో శనివారం నిర్వహించతలచిన రోడ్‌షో చివరి నిమిషాల్లో రద్దయ్యింది. ఫలితంగా నాలుగు గంటల పాటు తమ నేత కోసం ఎదురుచూసిన బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు నిరుత్సాహంతో వెను దిరిగారు. మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కేటీఆర్ పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో రోడ్‌షోలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో శనివారం సాయంత్రం 4:30 గంటలకు మేడ్చల్‌లో నిర్వహించాల్సిన రోడ్‌షోను ఎండ వేడిమి కారణంగా 7:30 గంటలకు నిర్వహించటానికి ఏర్పాట్లు చేపట్టారు. నాలుగు గంటల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున జనాలను వివేకానంద చౌరస్తా వద్దకు తరలించారు. కుత్బుల్లాపూర్ రోడ్‌షోలో ఉన్న కేటీఆర్.. చివరకు రావటం లేదని నాయకులు ప్రకటించారు. కాగా, అధికారంలోకి రాక ముందు నుంచి కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెబుతూ ప్రజలను మోసం చేస్తుందని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల కోసం అరవై అబద్దాలు చెప్పి.. ప్రజలను మోసం చేశారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేసే స్థితిలో కాంగ్రెస్ లేదన్నారు. భాస్కర్ యాదవ్, దయానంద్ యాదవ్, తదితరులున్నారు.

'బీజేపీని ఓడించి 'ఇండియా'ను గెలిపించండి'

వికారాబాద్, మే 4: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి 'ఇండియా' కూటమిని గెలిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.మహేందర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని, పదేళ్ల కాలంలో ప్రజలు చెమటోడ్చి సంపాదించిన డబ్బును జీఎస్టీ పేరుతో పన్నుల రూపంలో వసూలు చేసి పెట్టుబడుదారులకు కట్టబెడుతోందన్నారు. 400 ఎంపీ సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మార్చే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉందని, మతం పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ ఎన్నికల్లో గెలవాలని చూస్తోందన్నారు. ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు శ్రీనివాస్, రాములు, శ్రీకాంత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మద్దతు మోదీకే : కొండా

● జోరుగా బీజేపీ నాయకుల ప్రచారం

శంషాబాద్ రూరల్, మే 4 : దేశంలో అన్ని వర్గాల ప్రజల మద్దతు ప్రధాని మోదీకే ఉందని, మరోసారి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శంషాబాద్ మండలం నర్కూడలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. అనంతరం మీడియాతో కొండా మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలంటే బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యమని, మరోసారి చేవెళ్ల ఎంపీగా అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. చేవెళ్లను రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాననని చెప్పారు. కొందరు అధికారం, వ్యాపారం, ఆస్తులను కాపాడుకోవడం కోసం పార్టీలు మారుతారని.. ఓట్ల కోసం కోట్లు కుమ్మరిస్తూ గెలిచేందుకు ప్రయత్నం చేస్తున్నారని.. అలాంటి నాయకుల మాటలు నమ్మొద్దని అన్నారు. మైలార్‌దేవపల్లి కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రేంరాజ్, కుమార్‌యాదవ్, జూకల్ ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, తదితరులున్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

కందుకూరు/మహేశ్వరం/చేవెళ్ల, మే 4 : విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జిల్లా నాయకులు సాధ మల్లారెడ్డి కందుకూరు మండలం కొత్తగూడలో ఇంటింటి ప్రచారం చేశారు. బొక్క సత్యనారాయణరెడ్డి, హన్మంత్‌రెడ్డి, బాలేష్, తదితరులున్నారు. తుక్కుగూడ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ మున్సిపల్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు రమణారెడ్డి, చేవెళ్ల మండలాధ్యక్షుడు పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డిలు చేవెళ్ల మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. చేవెళ్ల గడ్డపై బీజేపీ జెండా ఎగరవేయాలని విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. చేవెళ్ల మండలం ముడిమ్యాల్ సర్పంచ్ శేరి స్వర్ణలతదర్శన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు లక్ష్మి, లావణ్య, కృష్ణ, కావలి సునిత, తదతర నాయకులు 100 మంది వరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి విశ్వేశ్వర్‌రెడ్డి నివాసంలో పార్టీలో చేరారు. కేఎస్ రత్నం, శోభ, ఇన్‌చార్జ్ ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు.



కులకచర్ల : లింగంపల్లిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సౌమ్యారెడ్డి

కొండాను గెలిపించాలి

కులకచర్ల/పూడూరు/బషీరాబాద్/పెద్దేముల్/మోమిన్‌పేట్/ధారూరు మే 4: కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని చౌడాపూర్ మండలం లింగంపల్లిలో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యారెడ్డి, నాయకులు పాల్గొన్నారు. పూడూరు మండల కేంద్రంలో మండలాధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించి కొండా గెలుపునకు కృషి చేయాలని సూచించారు. సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేష్‌పటేల్, తదితరులున్నారు. బషీరాబాద్ మండలంలోని పార్టీ కార్యాలయాన్ని నేత ఎం.నరేష్ ప్రారంభించారు. మండల ఇన్‌చార్జి భద్రేశ్వర్, గంగాధర్, తదితరులున్నారు. పెద్దేముల్ మండలం మన్‌సాన్‌పల్లి, బండపల్లి, ఖానాపూర్‌లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉప్పరి రమేష్ ప్రచారం చేశారు. ఇతర పార్టీల కార్యకర్తలు బీజేపీలో చేరారు. మండలాధ్యక్షుడు హరీశ్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు లలిత ఉన్నారు. చేవెళ్ల ఇన్‌చార్జి మల్లేశ్‌యాదవ్ పెద్దేముల్ మండలం టేకులపల్లిలో ప్రచారం చేశారు. మండలాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, తదితరులున్నారు. కొండాను గెలిపించుకుందామని ఆయన తనయుడు విశ్వజిత్‌రెడ్డి ధారూరు మండలం గట్టేపల్లి, అల్లీపూర్, రుద్రారం, అవుసుపల్లి, కుక్కింద తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. రమేశ్, వివేకానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: మాట్లాడుతున్న విశ్వజిత్‌రెడ్డి



శంషాబాద్ రూరల్ : నర్కూడలో ప్రచారం చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్ల : కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న ముడిమ్యాల్ మాజీ సర్పంచ్ స్వర్ణలత దర్శన్, తదితరులు

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి : ఈటల



మేడ్చల్ టౌన్ : ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న రాయిలాపూర్ గ్రామస్తులు

మేడ్చల్ టౌన్, మే 4 : ప్రతీ ఒక్కరు కష్టపడి పనిచేసి బీజేపీ విజయానికి కృషి చేయాలని మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన పలువురు గ్రామపెద్దలు, బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు శనివారం ఈటల సమక్షంలో బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ తన విజయానికి కృషి చేయాలని కోరారు. జిల్లా రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నందారెడ్డి, మాజీ జడ్పీటీసీ శైలజ హరినాథ్, నాయకులు దొడ్డ మల్లికార్జున్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ వల్ల ఒరిగిందేమీ లేదు

కుత్బుల్లాపూర్ : దేశాభివృద్ధి జరగాలన్నా, ప్రజలు ఉగ్రవాదుల భయం లేకుండా ఉండాలన్నా, ఆర్థిక వ్యవస్థ మెరుగు పడాలన్నా, మౌలిక వసతులు సమకూరాలన్నా అది కేవలం బీజేపీ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని, కాంగ్రెస్, బీఆర్ఎస్ వల్ల ఒరిగిందేమీలేదని ఈటల రాజేందర్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి వెంకటేశ్వరనగర్, మోదీ బిల్డర్స్‌లో నిర్వహించిన బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తనను మల్కాజిగిరి ఎంపీగా గెలిపించి ఆశీర్వదిస్తే ఇక్కడి సమస్యలపై నేరుగా ప్రధానితో చర్చించి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బీజేపీకి ఎందుకు ఓటేయ్యాలని అడుగుతున్నవారు ఇదే ప్రశ్నను అభినందన్ తల్లిని, మన నేవీ ఉద్యోగులను అడిగితే తెలుస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏదీ నెరవేరలేదన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఇక్కడ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎక్కడకు వెళ్లిన ప్రజలు ఆదరిస్తున్నారని, ఎంపీగా గెలవడం ఖాయమనే భరోసా ఇస్తున్నారని, గల్లీలో ఎవరున్నా.. ఢిల్లీలో మోదీ ఉండాలని కోరుకుంటున్నారన్నారు. మల్లారెడ్డి, భరత్‌సింహారెడ్డి, వాసు, సీనియర్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆశీర్వదించి గెలిపించాలి

జోన్‌బృందం : గల్లీలో ఎవరున్నా ఢిల్లీలో మోదీ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, తనను ఆశీర్వదించి గెలిపించాలని ఈటల అన్నారు. శనివారం జీడిమెట్ల డివిజన్‌లోని అయోధ్యనగర్, కుత్బుల్లాపూర్, భూమిరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో కుత్బుల్లాపూర్ నాయకులతో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజలు మంగళహారతులతో రాజేందర్‌ను ఆశీర్వదించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో ఒకే చట్టం ఉండాలని ఎంతో కృషి చేశారని, కశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసి, దాన్ని ప్రత్యేక రాష్ట్రంగా.. కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. దేశంలో టెర్రరిస్టులకు, మిలిటెంట్లకు సింహ స్వప్నంగా మారారని అన్నారు. సైనికులకు మోదీ అండగా నిలబడి, దేశ విదేశాల్లో వారి కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించారన్నారు. నాయకులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి, భరత్‌సింహారెడ్డి, బక్క శంకర్‌రెడ్డి, తదితరులున్నారు.



హయత్‌నగర్ : బొమ్మలగుడి పరిసర కాలనీల్లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

బౌరంపేట, నిజాంపేట్‌లో ప్రచారం

ఈటల రాజేందర్‌కు మద్దతుగా జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరాచారి కౌన్సిలర్ కృష్ణారెడ్డి, మున్సిపల్ ప్రధాని కార్యదర్శి నర్సింహాచారిలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి రాజేందర్‌ను గెలిపించాలని కోరారు. నిజాంపేట్ 1వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రణీత్‌గ్రేటెడ్ కమ్యూనిటీ సర్కిల్లో ఈటలను గెలిపించాలని, నవభారత నిర్మాత నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ స్థానికులతో ప్రచారం నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి, విజ్ఞాన్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, సోమశేఖర్ పాల్గొన్నారు.

ఎమర్జింగ్ భారత్ కార్యక్రమంలో ఈటల

సుచిత్రలో నిర్వహించిన ఎమర్జింగ్ భారత్ కార్యక్రమంలో ఈటల పాల్గొని మాట్లాడుతూ భారత్‌ను ప్రధాని ప్రపంచ దేశాల్లో తలెత్తుకునే విధంగా చేశారన్నారు. మల్కాజిగిరిలో తనను ఆశీర్వదించి బీజేపీ గెలిచే 400 ఎంపీ స్థానాల్లో ఒకడిగా నిలబెట్టాలని ప్రజలను కోరారు.

ఈటల రాజేందర్‌ను గెలిపించాలి

హయత్‌నగర్ : ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డివిజన్ పరిధిలోని సీఎస్ఆర్ కాలనీ, గ్రీన్ సిటీ కాలనీ, ఛండీశ్వరి కాలనీ, గాయత్రినగర్ కాలనీ, వీరన్నగుట్ట కాలనీ, స్వాతి రెసిడెన్సీ, బొమ్మలగుడి ప్రధాన రోడ్డు వెంట ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ బీజేపీకే ఓటు వేసి ఈటలను గెలిపించాలని కోరారు. బూత్ కమిటీ నాయకులున్నారు.

మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

● మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవాబుపేట, మే 4: అసెంబ్లీ ఎన్నికల్లో మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆరు గ్యారంటీలను అమలు చేసేదెన్నడోనని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శనివారం నవాబుపేట మండల కేంద్రంలోని లింగంపల్లి లక్ష్మారెడ్డి గార్డెన్‌లో జరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులకు ఏకకాలంలో రైతు రుణ మాఫీ చేస్తానన్న కాంగ్రెస్..నేటి వరకు ఎందుకు అమలు చేయడం లేదోనని ప్రశ్నించారు. రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామని ప్రజలను మభ్యపెట్టారన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కాసాని జ్ఞానేశ్వర్, స్వామిగౌడ్, ఎమ్మెల్యే యాదయ్య, ఎంపీపీ భవానీ, జడ్పీటీసీ జయమ్మ, పోలీసు రామ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు నాగిరెడ్డి, పి.భరత్‌రెడ్డి, తలారి అజయ్‌కుమార్, రాఘవేందర్ తదితరులున్నారు.



నవాబుపేట : సమావేశంలో పాల్గొన్న జ్ఞానేశ్వర్, ఎమ్మెల్యేలు సబితారెడ్డి, యాదయ్య తదితరులు

జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి : రోహిత్‌రెడ్డి

పెద్దేముల్ : చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని, తాను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినందుకు బాధ లేదని, తాండూరు బిడ్డగా సేవ చేస్తూనే ఉంటానని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం ఇందూరు, జైరాంతండాలో కాసాని తరపున స్ట్రీట్‌కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంద్రాగస్టు వరకు రుణమాఫీ చేస్తామని ఓట్లడుగుతున్న ఎమ్మెల్యే.. మాఫీ చేయకుంటే రాజీనామా చేస్తారా? అని సవాల్ చేశారు. జడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, నాయకులున్నారు.



చేవెళ్ల : ప్రచారం చేస్తున్న నాయకులు

అన్నారు. కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో బైరాగూడ, రాచులూరు, బేగంపేట, గుమ్మడవెల్లిలో ప్రచారం చేశారు. ఎస్.రాజశేఖర్‌రెడ్డి, గోవర్ధన్, దేవీలాల్‌నాయక్, కాకి రాములు, గుయ్యని సామయ్య, కాకి దశరథ, సురేష్, తదితరులున్నారు. కాగా, బషీరాబాద్ మండలం ఎక్మాయి శివారులో బీఆర్ఎస్ నాయకులు ఉపాధి కూలీలను కలిసి ఓటు వేయాలని కోరారు.

బీఆర్ఎస్‌తో రాష్ట్రాభివృద్ధి

చేవెళ్ల : బీఆర్ఎస్‌తో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చేవెళ్ల మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, మండలాధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. చేవెళ్ల మండలం అల్లావాడ, జాలగూడ, మండల కేంద్రంలోని న్యూ జర్నలిస్టు కాలనీ, సీపీఐ కాలనీల్లో ప్రచారం చేశారు. కాసానిని భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు నర్సింలు, బీన ర్సింలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

పరిగి/శంషాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల్లోనే విఫలమైందని, చేవెళ్ల ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి అన్నారు. పరిగి మండలం రంగంపల్లి, గడిసింగాపూర్ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, ఎంపీపీ అరవింద్‌రావు, మండలాధ్యక్షుడు అంజనేయులు, తదితరులున్నారు. కాగా, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జయసింహ పార్టీకి ఇటీవల రాజీనామా చేసి కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ గెలుపుకోసం కృషిచేస్తానన్నారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు దూడల వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, తదితరులున్నారు.



పరిగి : రంగంపల్లిలో కూలీలను కలిసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా ప్రచారం

దోమ/కులకచర్ల: కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా దోమ మండల మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కె.రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్యల ఆధ్వర్యంలో ఉదన్‌రావుపల్లిలో ప్రచారం చేశారు. కోఆప్షన్ సభ్యుడు ఖాజపాష, గోళ్ల శ్రీనివాస్, తదితరులున్నారు. కులకచర్ల, తిరుమలపూర్‌లో ఎంపీటీసీ కృష్ణయ్యగౌడ్, శ్రీశైలం, బాలకృష్ణగౌడ్, రాజయ్య, తిరుమలపూర్ తదితరులు ప్రచారం చేశారు.

చేవెళ్లలో కాసాని గెలుపు ఖాయం

కందుకూరు/బషీరాబాద్ : బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని ఎస్ఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డిలు



పెద్దేముల్ : ఇందూరులో మాట్లాడుతున్న రోహిత్‌రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభమెప్పుడు?

● అకాల వర్షాలతో అన్నదాతల భయాందోళన

● కొనుగోలు కేంద్రాల వద్ద పేరుకుపోతున్న రాశులు

పెద్దేముల్, మే 4 : వరి కోతలు పూర్తయ్యాక రైతులు ధాన్యం విక్రయాల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు తెరుస్తుందోనని రైతువేదికల వద్ద నిరీక్షిస్తున్నారు. అధికారులు మాత్రం ఎన్నికల హడావిడిలో పడిపోయి రైతుల సంగతి మరిచినట్లు కనిపిస్తోంది. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. పెద్దేముల్ మండలంలో సుమారు 3,500 ఎకరాల్లో రైతులు వరిని సాగుచేశారు. గతేడాది వర్షాకాలం చివరలో నెలరోజుల పాటు వర్షాలు కురవలేదు. దాంతో చెరువులు, కుంటల్లో పూర్తిస్థాయిలో నీరు చేరలేదు. భూగర్భజలాలు కూడా అంతంతమాత్రంగానే ఉండిపోయాయి. చెరువుల కింద వర్షాకాలంలో పంటలు సాగుచేసుకున్న రైతులు నీరులేక రబీపంటలు సాగుచేయలేదు. బోరుబావుల కింద కొందరు రైతులు వరి సాగుచేశారు. వరికోతలు ప్రారంభమై పదిహేను రోజులు కావస్తోంది. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసే స్థలానికి చేర్చి రాశులుగా పోశారు. అయితే, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ఆలస్యం అవుతుండడంతో పాటు ఎండలకు ధాన్యం తూకం తక్కువవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, ధాన్యం రాశులవద్ద కాపలా ఉండడం కూడా కష్టంగా మారిందని వాపోతున్నారు. అంతేకాకుండా అకాల వర్షాలు ముంచెత్తితే ఉన్న ధాన్యం కూడా పాడైపోతుందని భయపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధాన్యానికి క్వింటాలుకు బోనస్ కింద రూ.500 ఇస్తామని చెప్పడంతో రైతులు ఆశలు పెంచుకున్నారు.



మంబాపూర్‌లో రైతువేదిక వద్ద ధాన్యం రాశులు

బీజేపీ వస్తే రాజ్యాంగం మార్చుతారట

● చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

షాబాద్/చేవెళ్ల, మే 4 : బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్నే మార్చుతారట అని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శనివారం షాబాద్‌లో భారీ రోడ్‌షో నిర్వహించి, ఎంఎస్ గార్డెన్‌లో సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి పదేళ్లగా బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ చేసిన దోపిడీని, చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను ఓటు ద్వారా తరిమికొట్టాలన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డికి వేల కోట్ల ఆస్తులు ఉన్నా.. ఏం లాభమని, ప్రజలకు అందుబాటులో ఉండడని, కార్యకర్తలనే గుర్తుపట్టడని ఆరోపించారు. కాంగ్రెస్ గెలుపుతోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. భారీ మెజార్టీతో గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానన్నారు. చేవెళ్ల సమగ్రాభివృద్ధికి పాటుపడతానన్నారు. భీంభరత్, పీసీబీ మెంబర్ సత్యనారాయణరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు

షాబాద్ మండలం సర్దార్‌నగర్, మన్‌మర్రి, బోడంపహాడ్, ఏట్లఎర్రవల్లి, లింగారెడ్డిగూడ తదితర గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. రంజిత్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డిలు చేవెళ్ల మండలం మీర్జగూడ, బస్తేపూర్, దామరిగిద్ద తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. 30 ఏళ్లుగా మాదిగ జాతిని అడ్డం పెట్టుకొని మోసం చేస్తున్న మందకృష్ణ.. మాదిగ జాతి ద్రోహి అని తెలంగాణ రాష్ట్ర మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ కిరణ్‌కుమార్ మాదిగ అన్నారు. చేవెళ్లలోని కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీల్లో పదవులు అనుభవించిన మోత్కుపల్లి నర్సింహులు మోసం చేశారన్నారు.



షాబాద్ : రోడ్‌షోలో రంజిత్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు, కార్యకర్తలు

కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి : స్పీకర్

మోమిన్‌పేట్ : కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆయన సమక్షంలో మోమిన్‌పేట్ మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మండలాధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ ఆధ్వర్యంలో స్పీకర్ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్ఎస్ మాజీ ఎంపీపీ శివకుమార్‌స్వామి, మండల మాజీ అధ్యక్షుడు విఠల్, 60 మంది బీఆర్ఎస్ కార్యకర్తలున్నారు.

రంజిత్‌రెడ్డిని గెలిపించాలి : అనితారెడ్డి

మహేశ్వరం/కందుకూరు/, మే 4 : రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి అన్నారు. మహేశ్వరం పట్టణ కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, కందుకూరు మండలాధ్యక్షుడు కృష్ణానాయక్‌ల ఆధ్వర్యంలో కొత్తగూడ, జైత్వారం, పులిమామిడి, పెద్దమ్మతాండ, మీర్కాన్‌పేట నుంచి బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన 80మంది కాంగ్రెస్‌లో కేఎల్లార్ సమక్షంలో చేరారు. మండల కేంద్రం, జబ్బార్‌గూడలో ప్రయాణికులను జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఓట్లు అడిగారు. కాగా, దేశం కోసం ప్రాణ త్యాగం చేయడంతో పాటు ప్రధాని పదవులను కూడా తృణప్రాయంగా వదులుకున్న చరిత్రగల కుటుంబం రాహుల్ గాంధీదని, బీజేపీ, బీఆర్ఎస్‌లు దేశం కోసం ఏం వదులుకున్నారో చూపించాలని పీసీసీ అధికార ప్రతినిధి బోద మాధవరెడ్డి అన్నారు. మహేశ్వరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రంజిత్‌రెడ్డిని గెలవడం ఖాయమన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

కులకచర్ల/యాలాల/వికారాబాద్/పెద్దేముల్/పూడూరు/ధారూరు/ తాండూరురూరల్/పరిగి : రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. కులకచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో ప్రచారంలో పాల్గొన్నారు. కులకచర్ల పీజేఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన గిరిజన, ఆదివాసీ బంజార తాలూకా స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని వికారాబాద్ జిల్లా కోఆప్షన్ సంఘం అధ్యక్షులు అక్బర్ బాబా యాలాల మండల కేంద్రంలో ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని వికారాబాద్ పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మునిసిపల్ పరిధి ధన్నారంలో ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. పెద్దేముల్ మండల కేంద్రంలో ప్రచారంలో పాల్గొన్నారు. జడ్పీటీసీ ధారాసింగ్, తదితరులున్నారు. రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందామని పూడూరు మండల కాంగ్రెస్ నాయకులు పెద్దఉమ్మెంతాల్‌లో ప్రచారం చేశారు. రంజిత్‌రెడ్డి తనయుడు ఆర్యన్‌రెడ్డి ధారూరు మండలం అల్లీపూర్‌లో పర్యటించి ప్రచారం చేశారు. జాతీయ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, నాయకులున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ ఆధ్వర్యంలో ధారూరు మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. తాండూరు మండలం కరన్‌కోట్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకులు మాజీ ఎంపీపీ శరణబసప్ప, తుపాకుల బసప్ప ఆధ్వర్యంలో తాండూరులో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరారు. ఆదివాసీ, గిరిజనులు కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని పీసీసీ ఆదివాసీ, కాంగ్రెస్ స్టేట్ చైర్మన్ తేజావత్ బెలయ్యనాయక్ కోరారు. కులకచర్లలో నియోజకవర్గస్థాయి గిరిజనుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ నివాసంలో వికారాబాద్ మునిసిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పట్టణాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పరిగి మార్కెట్‌లో వ్యాపారులు, రైతులను కలిసి అభ్యర్థించారు. చౌడాపూర్ మండలం మందిపల్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.



కులకచర్ల : ముజాహిద్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

శతాధిక వృద్ధురాలు.. అందరికీ ఆదర్శం

● వంద ఏళ్లు దాటినా.. బాధ్యతగా ఓటుహక్కు వినియోగం

చౌదరిగూడ, మే 4: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు హోం ఓటింగ్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకుంది. శనివారం ఎన్నికల సిబ్బంది వయో పరిమితి 80 ఏళ్లు పైబడిన వారందరితో ఓటు వేయించుకున్నారు. దాదాపు 120 ఏళ్లు ఉన్న వృద్ధురాలు పిట్ట వెంకమ్మ ఫారం 12 ద్వారా ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకుంది. పోలింగ్ అధికారి సత్యమ్మ ఆమె ఇంటికి వెళ్లి బ్యాలెట్ పత్రాన్ని అందజేశారు. కుటుంబసభ్యుల సహకారంతో తనకు నచ్చిన పార్టీ/అభ్యర్థికి ఓటువేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.



తుమ్మలపల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్న వెంకమ్మ

ఉపాధి పనులకు ఉదయాన్నే రావాలి

బషీరాబాద్, మే 4: మండుటెండల దృష్ట్యా ఉదయాన్నే ఉపాధి కూలీలు పనికి వచ్చి నిర్ణీత వ్యవధిలో ఇంటికి వెళ్లాలని బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు అన్నారు. మండలంలోని నీళ్లపల్లి శివారులో శనివారం ఉపాధి పనులను పరిశీలించి పని ప్రదేశం వద్ద కూలీలతో సమావేశమయ్యారు. ఉపాధి కూలీలకు కూలి వేతనాలు గతనెల 30 వరకు అందరికీ వచ్చాయని గుర్తుచేశారు. రోజు కూలీలు తొందరగా పనులకు వచ్చి నిబంధనల ప్రకారం పనులు చేపట్టి ఎండ ముదరకముందే ఇళ్లకు వెళ్లిపోవచ్చన్నారు. కూలీలు లక్ష్యం మేరకు పనులకు వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట ఈసీ నర్సింహారెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేషం ఉన్నారు.



కూలీలతో చర్చిస్తున్న ఎంపీడీవో రాఘవులు

'బీఆర్‌ఎస్ గెలుపు ఖాయం'

కొత్తూర్, మే 4: ప్రజలనుంచి వస్తున్న మద్దతు చూస్తే మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు ఖాయమని కేశంపేట ఎంపీపీ వై.రవీందర్ యాదవ్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలో శనివారం జడ్పీటీసీ శ్రీలతసత్యనారాయణ, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్‌లతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

'కాంగ్రెస్‌ది గారడీ పాలన'

మంచాల: గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ పాలన సాగిస్తోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. ఆగాపల్లి, జాపాల, రంగాపూర్ గ్రామాల్లో శనివారం ప్రచారంలో నిర్వహించారు.

'రిజర్వేషన్ల పరిరక్షణకు కాంగ్రెస్‌తో కలిసి రావాలి'

ఆమనగల్లు/కడ్తాల్, మే 4 : దేశ భవిష్యత్తును నిర్దేశించే లోక్‌సభ ఎన్నికల్లో రాజ్యాంగం, రిజర్వేషన్లు, ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థికే ఓటు వేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి, కడ్తాల మండలం కానుగుబావి తండా, గాన్గుమర్ల తండాల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

కేంద్ర పథకాలపై ప్రచారం

మంచాల: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి శ్రేణులకు పిలుపునిచ్చారు. మంచాలలో పార్టీ బూత్ అధ్యక్షులు, కోఆర్డినేటర్లు, మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు.

అభివృద్ధికి సహకరించాలి

యాచారం: పేదల కడగండ్లు తీర్చే సీపీఎం అభ్యర్థిని గెలిపించి అభివృద్ధికి సహకరించాలని సీపీఎం మండల నాయకుడు థావ్‌నాయక్ అన్నారు. మంతన్‌గౌరెల్లిలో పార్టీ శ్రేణులు ఇల్లిల్లు తిరిగి ఎన్నికల ప్రచారం చేశారు.

'కాంగ్రెస్ విజయం ఖాయం'

యాచారం: భువనగిరి లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం ఖాయం అని ఎమ్మెల్యే ఎం.రంగారెడ్డి తనయుడు అభిషేక్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభంజనం'

మంచాల: పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభంజనం ఖాయమని ఆ పార్టీ నాయకుడు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. లోయపల్లి, సత్యం తండా, దాద్‌పల్లి, ఆరుట్ల, చిత్తాపూర్, నోముల తదితర గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

రేపు చలో కల్వకుర్తి

ఆమనగల్లు, మే 4:ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 6న కల్వకుర్తిలో బీజేవైఎం ఆధ్వర్యంలో యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తామని మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్, జిల్లా ఉపాధ్యక్షుడు కండె సాయి, నియోజకవర్గ కన్వీనర్ పద్మఅనిల్ తెలిపారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు, వివిధ మోర్చాల శ్రేణులు తరలిరావాలని కోరారు. ఆమనగల్లులో వారు మాట్లాడారు. మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమవుతుందని తెలిపారు.

'కేటీఆర్ సభకు తరలిరావాలి'

ఆమనగల్లు, మే 4 : ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 8న కల్వకుర్తిలో పర్యటిస్తారని.. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో ఎన్నికల ప్రచారం చేశారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

కడ్తాల్: కడ్తాలలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు

పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న ఏఆర్వో శ్రీను

ఆమనగల్లు, మే 4: ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు కల్వకుర్తి నియోజకవర్గంలో పకడ్బందీగా ఏర్పాట్లుచేసినట్లు ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి ఆర్డీవో శ్రీను తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల పరిధిలో శనివారం ఆయన పర్యటించి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, చారగొండ, తలకొండపల్లి, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో 2,44,405 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. గతంలో ఉన్న 262పోలింగ్ కేంద్రాలకు అదనంగా మైసిగండి, గడ్డమీది తండా, పెద్దవేములోని బావి తండా, గోవిందాయిపల్లి తండా, శంకర్‌కొండ తండా, గౌరారం, కేస్లి తండా, ఉప్పలగట్టు తండా, కంటోనిపల్లిలల్లో కొత్తగా పోలింగ్‌కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఓటర్ల సౌకర్యార్థం లోకేషన్ మార్పులో భాగంగా చంద్రాయన్‌పల్లితండా, జేపల్లి, కల్వకుర్తిలో రెండు, చెదురుపల్లి, కాట్రామ్‌తండాల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తామన్నా రు. ఏడు మండలాల్లో పోలింగ్ విధులకు 2,150 మంది పోలింగ్ సిబ్బందిని ఎంపిక చేసి రెండుసార్లు శిక్షణ ఇచ్చామన్నారు. హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తయిందని, వృద్ధులు, దివ్యాంగుల ఓట్లు 88ఓట్లకు గాను 81ఓట్లు పోలైనట్లు తెలిపారు. 1870 మంది పోస్టల్ బ్యాలె ట్ల ఓటింగ్‌కు కల్వకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశామని శ్రీను వివరించారు.

ప్రతొక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఇబ్రహీంపట్నం: 18ఏళ్ల పైబడిన ప్రతొక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీవో కె.క్రాంతికిరణ్ అన్నారు. రాయపోల్‌లో స్వీప్ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు రామకృష్ణ, నాగరాజు తదితరులున్నారు.



రాయపోల్‌లో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

పలుచోట్ల హోం ఓటింగ్



చేవెళ్లలో ఇంటి వద్దకు వెళ్లి ఓటు వేయిస్తున్న అధికారులు

చేవెళ్ల/చౌదరిగూడ/కేశంపేట, మే 4 : నిబంధల మేరకు 80ఏళ్లకు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి పోలింగ్ ఇళ్ల వద్ద కొనసాగుతోంది. చేవెళ్లలో నియోజకవర్గంలో హోం ఓటింగ్ కొనసాగుతోందని ఆర్డీవో సాయిరాం శనివారం తెలిపారు. నియోజకవర్గంలో 342 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి పోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 8వ తేదీ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి బ్యాలెట్ ఓటింగ్ అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీవో విఠలేశ్వర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల గ్రామాల్లో 20 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేయగా శనివారం 12మంది ఓటు వేశారని అధికారులు తెలిపారు. ఇళ్ల వద్ద ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. బ్యాలెట్ పేపర్లను సీల్డ్ కవర్లో ఆర్డీవో కార్యాలయానికి పంపించారు. కార్యక్రమంలో పీవో సత్యమ్మ, ఓపీవో ఖాజ ఇలీయాస్, మైక్రో అబ్జర్వర్ అశోక్‌కుమార్, ఆర్ఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు. కేశంపేట పీవో శిరీష ఆధ్వర్యంలో 11మందికి హోం ఓటింగ్ నిర్వహించారు. ఓటింగ్ ప్రక్రియను వీడియో చిత్రీకరణ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ నివేదిత, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



కేశంపే: ఇంటి వద్ద పోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఖాయం

యాచారం, మే 4: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం ఖాయమని, తద్వారా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రగతి సాధిస్తుందని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి యాచారంలో రోడ్ షోలో మాట్లాడారు. మోదీ అదాని, అంబానీలకు అండగా ఉంటున్నారే తప్ప పేదల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజ్‌గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

డీకే అరుణ జన్మదిన వేడుక.. ఎన్నికల ప్రచారం



కొత్తూర్‌లో కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి

కొత్తూర్, మే 4 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ జన్మదిన సందర్భంగా శనివారం ఆ పార్టీ నాయకులు కొత్తూర్‌లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఓ వైపు జన్మదిన వేడుకలతో పాటు, ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓటర్లను ఆకట్టుకున్నారు. వేడుకలకు హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎన్.శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ మూడోసారి ప్రధాని కాబోతున్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజుచారి, పార్లమెంట్ కోకన్వీనర్ నర్సింహాగౌడ్, నాయకులు కడెంపల్లి సదానంద్‌గౌడ్, బావండ్ల మాణిక్యం, మంగళి రమేష్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఎస్పీ నాయకుడు

షాద్‌నగర్ అర్బన్: షాద్‌నగర్ అసెంబ్లీ స్థానంలో బీఎస్పీ అభ్యర్థిగా పోటీచేసిన పసుల ప్రశాంత్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి డీకే.అరుణ సమక్షంలో ఆయన బీజేపీలో చేరారు. అలాగే బీఆర్‌ఎస్‌కు చెందిన క్యామ మహేష్, క్యామ శ్రీనివాస్, అభిరామ్, యాదగిరి, పలువురు యువకులు బీజేపీలో చేరారు. మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని ప్రజలు కోరుతున్నారని అరుణ అన్నారు. నాయకులు బాబయ్య, వెంకటేష్‌గుప్తా పాల్గొన్నారు.



డీకే.అరుణ సమక్షంలో పార్టీలో చేరుతున్న ప్రశాంత్

అన్ని రాజకీయ పార్టీల నాయకులు

పోలీసులకు సహకరించాలి



చేవెళ్లలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చేవెళ్ల, మే 4: ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని చేవెళ్ల ఏసీపీ బంటు కిషన్ తెలిపారు. శనివారం చేవెళ్లలోని వివిధ కాలనీల్లో పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టించవద్దని సూచించారు. ప్రశాంత పోలింగ్ కోసం ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మారెడ్డి, ఎస్సైలు వీరబ్రహ్మం, ప్రదీప్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కోసం మాదిగలు ఏకం కావాలి



మాట్లాడుతున్న మంగ్లి విజయ్, మబ్బు సాయిలు

ఆమనగల్లు, మే 4 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలను నిర్లక్ష్యం చేస్తుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మంగ్లీ విజయ్, మబ్బు సాయిలు ఆరోపించారు. రాష్ట్రంలోని ఎస్సీ రిజర్వుడు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ ఒక్కటైనా పార్టీ మాదిగలకు ఇవ్వలేదన్నారు. ఆమనగల్లులోని లక్ష్మీ గార్డెన్‌లో శనివారం ఎమ్మార్పీఎస్ కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి మాదిగల సమావేశ్నాన ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు వస్పుల సాయిలు ఆధ్వర్యంలో నిర్వహించారు. మాదిగలను గుర్తించని కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలు గుణపాఠం చెప్పాలన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని స్థానికేతరుడైన ఖమ్మం జిల్లాకు చెందిన మల్లు రవికి ఇవ్వడం సరికాదన్నారు. ఉన్నత విద్యావంతుడు బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మాదిగలు మద్దతిచ్చి గెలిపించాలని నాయకులు పిలుపునిచ్చారు.

నేడు నగరంలో రెడ్ల కృతజ్ఞత సభ

ఆమనగల్లు, మే 4: దశాబ్దాల పోరాటాన్ని గుర్తించి రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతాభావంగా ఆదివారం నగరంలోని ఎల్‌బీ నగర్ పిండి పుల్లారెడ్డి గార్డెన్‌లో ఉదయం 10గంటలకు సభ ఏర్పాటు చేసినట్లు రెడ్డి జేఏసీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు లిక్కి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు వి.సంధ్యారెడ్డి, రాష్ట్ర నాయకుడు ఎల్.అనుద్రారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, సంఘం నాయకులు హాజరవుతారని తెలిపారు.

గౌడలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం : ఎమ్మెల్యే శంకర్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్/షాద్‌నగర్ రూరల్/కొత్తూర్/కేశంపేట, మే 4 : గౌడ కులస్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని కుంట్ల రాంరెడ్డి గార్డెన్‌లో శనివారం గౌడల సమ్మేళనానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో గౌడలంతా కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. మాజీ జడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, శివశంకర్‌గౌడ్, జి.బాల్‌రాజ్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, కుమారస్వామిగౌడ్, రాఘవేందర్ గౌడ్, రాములుగౌడ్ పాల్గొన్నారు. షాద్‌నగర్ మండలం మొగిలిగిద్ద మాజీ సర్పంచ్ లలిత అంజయ్య, కార్యకర్తలు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీ ఇద్రిస్‌అహ్మద్, శ్రీశైలం, లింగం, రాకేష్, పాండు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుస్థిరపాలన అందుతుందని కేశంపేట జడ్పీటీసీ, మండల కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి విశాల శ్రవణ్ అన్నారు. కొత్తూర్‌లో చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచులు జె.సుదర్శన్‌గౌడ్, జగన్, నాయకులు జనార్దన్‌చారి, నర్సింహ పాల్గొన్నారు. కేశంపేట, మండలంలోని అల్వాల, పాటిగడ్డ, కొత్తపేట, ఎర్రగడ్డ తండాల్లో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. రైతులకు త్వరలోనే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలంటే వంశీచంద్‌ను గెలిపించాలని వివరించారు. ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌లో చేరగా నేతలు కండవా కప్పి ఆహ్వానించారు. పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, జగదీశ్వర్, సురేష్‌రెడ్డి, టి.శ్రవణ్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, ఇబ్రహీం, ఎ.రమేష్, భాస్కర్‌గౌడ్, గిరిధర్, పెంటయ్య, రూప్లా, యాదగిరి పాల్గొన్నారు.

కాలనీల్లో దోమలు, ఈగల బెడదతో అవస్థలు



ఫిరంగి నాలాలో పేరుకుపోయిన మురుగు నీరు

శంషాబాద్, మే 4 : శంషాబాద్‌లోని ఆర్బీనగర్, మధురానగర్ కాలనీల్లో ఓపెన్ డ్రైనేజీలతో పాటు పక్కనే ఫిరంగి నాలా ఉండటంతో ఈగలు, దోమలతో ప్రజలు ఇబ్బం దులు పడుతున్నారు. సాయంత్రం వేళ వీటి మోత మరీ ఎక్కువగా ఉండటంతో బస్తీవాసులు బెంబేలెత్తుతున్నారు. చారిత్రక ఫిరంగినాలా నిర్వహణను పట్టించుకోక ఓపెన్‌గానే ఉంచడంతో అందులో వ్యర్థాలు పెద్దఎత్తున చేరుతున్నాయి. నాలాలో నీటి ప్రవాహం లేక మురుగు గుంటలా తయారైంది. ఆయా ప్రాంతాల్లో తీవ్ర దుర్వాసన వస్తోంది. నాలా దోమలు, ఈగలు, పందులకు నిలయంగా మారిందని బస్తీవాసులంటున్నారు. శంషాబాద్ పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. జనాభా పెరుగుతున్నారు. కాలువకు ఇరువైపులా పెద్దఎత్తున తినుబండాలు విక్రయించే డబ్బాలు వెలుస్తున్నాయి. ఇక్కడి డబ్బాల్లో ఇడ్లీ,సాంబార్, పూరి, ఉప్మా,దోష తదితర టిఫిన్లు తక్కువ ధరకు దొరుకుతుండటంతో ప్రజలు ఎక్కువ మంది ఇక్కడి వస్తూ వ్యర్థాలను కాలువలో పడేస్తున్నారు. చెత్తా చెదారం కూడ ఫిరంగి నాలాలో వేస్తున్నారు. దీంతో మరింతగా దుర్గంధం పెరిగిపోతుంది. గత రెండేళ్ల క్రితం ఇక్కడ మున్సిపాలిటీ వారు ఫిరంగినాలాలో పూడికతీత పనులు చేపట్టారు. అప్పుడు దుర్వాసన తగ్గిపోయింది. కాలా క్రమేనా కాలనీవాసులు, దుకాణదారులు తిరిగి చెత్తవేయడం, కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలు పగిలిపోయి మురుగు నీరు రోడ్లపైకి చేరడంతో దుర్గంధం అలుముకుంటుంది. సాయంత్రం నోరు తెరిస్తే చాలు దోమలు దూరే పరిస్థితి తయారైంది. మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నా పేరుకున్న మురుగుతో దోమలు కంట్రోల్ అవడం లేదు.

సాయంత్రం ఫాగింగ్ చేయించాలి



ఓపెన్ డ్రైనేజీల వల్ల దోమలు, ఈగలు ఎక్కువవుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల పాలయ్యే ప్రమాదం ఉంది. అధికారులు సాయంత్రం పూట రెండు గంటల పాటు ఫాగింగ్ చేయిస్తే దోమల బాధ కొంతైనా తగ్గుతుంది.

- మేకల వెంకటేశ్, కౌన్సిలర్

అసత్య ప్రచారం చేస్తున్న ఆకతాయిలపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్, నాయకులు

కడ్తాల్, మే 4: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కడ్తాల, ఆమనగల్లు, తలకొండపల్లి, కల్వకుర్తి మండలాల బీఆర్‌ఎస్ నాయకులు పోలీసులను కోరారు. శనివారం కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, కల్వకుర్తి మార్కెట్ మాజీ చైర్మన్ సింగం విజయ్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు అర్జున్‌రావు, శంకర్ సీఐ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ నాగర్‌కర్నూల్‌లో రోడ్ షోలో పాల్గొని తిరిగి హైదరాబాద్ వెళ్తూ ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లి వద్ద ఓ హోటల్ వద్ద బస్సు ఆగారు. అక్కడే లెమన్ టీ తాగారని తెలిపారు. ఈ సన్నివేశాన్ని చిత్రీకరించి కొందరు సోషల్ మీడియాల్లో 'కేసీఆర్ మద్యం తాగుతున్నారు.' అని తప్పుడు పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని నాయకులు సీఐకి ఇచ్చిన ఫిర్యాదులో కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో కల్వకుర్తి వైస్‌ఎంపీపీ గోవర్ధన్, సోన శ్రీనునాయక్, బిక్షపతి, శంకర్ నాయక్, తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి నాయకుడి ఆపన్నహస్తం



కేశంపేట, మే 4: తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బీస కరుణాకర్‌రెడ్డి ఆపన్నహస్తం అందించా రు. గ్రామానికి చెందిన బ్యాగిరి పోచయ్య 6రోజుల కింద మృతిచెందాడు. అతడి కుటుంబానికి శనివారం 50కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.4,500నగదును అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, భీమయ్య, చంద్రయ్య, గుత్తి చంద్రయ్య, శేఖర్, శివయ్య, నర్సింలు, రాజు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం



వికాస్‌రెడ్డి(ఫైల్)

షాద్‌నగర్ రూరల్, మే 4 : షాద్‌నగర్ ప్రాంతంలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి. శనివారం షాద్‌నగర్ శివారులో బైక్ నుంచి పడి యువకుడు మృతిచెందాడు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన వికాస్‌రెడ్డి (36) సాయంత్రం బైక్‌పై షాద్‌నగర్ నుంచి సొంతూరు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. దీంతో పడిపోయిన వికాస్‌రెడ్డి తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ సీహెచ్‌సీకి తరలించారు. కాగా వికాశ్‌రెడ్డి ప్రమాదంపై ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలు తెలుసుకొని ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుడి కుటుంబసభ్యులను వారు పరామర్శించారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు ...



మృతుడు సురేష్

కొత్తూర్, మే 4 : మండల పరిధి తిమ్మాపూర్ సమీప 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్మూరి సురేష్(25) అనే వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురానికి చెందిన సురేష్ కుటుంబంతో కలిసి కొత్తూర్ వచ్చి మేస్త్రీగా పనిచేస్తున్నాడు. బైక్‌పై తిమ్మాపూర్‌కు వెళ్తొస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొని సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. మృతదేహాన్ని సీహెచ్‌సీకి తరలించి, సురేష్ తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సురేష్‌కు భార్య, కొడుకు ఉన్నాడు.

అన్న దాడితో మనస్తాపం.. తమ్ముడి ఆత్మహత్య



యాదయ్య(ఫైల్)

మాడ్గుల, మే 3 : అన్నదమ్ముల గొడవలో తమ్ముడిపై అన్న, అతడి కొడుకులు దాడితో మనస్తాపానికి గురైన తమ్ముడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కలకొండలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అన్న పులి పాపయ్య, తమ్ముడగు పులి యాదయ్య(40) పొలం వద్ద గొడవ పడ్డారు. పాపయ్య, అతడి కొడుకులు శ్రీనాథ్, శివ కలసి యాదయ్యను కొట్టారు. దీంతో మనస్థాపానికి గురైన యాదయ్య పొలం వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొట్లాటకు పాత పగలే కారణమని యాదయ్య భార్య పులి పుష్ప, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. తన భర్తను కొట్టడంవల్లే బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని పుష్ప ఫిర్యాదు చేశారు. మగ్గురుని పోలీసులు అదుపులోకి తీసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. యాదయ్యకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

భూ తగాదాలో ఇరువర్గాల ఘర్షణ

యాచారం, మే 4 : భూ తగాదాలో ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ ఘటన శనివారం మాల్‌లో జరిగింది. ఎస్సై వెంకటనారాయణ తెలిపిన వివరాల మేరకు.. మాల్‌లోని సర్వే నంబర్460లో గల 18ఎకరాల 27గుంటల భూమిపై కొన్నేళ్లుగా పురుషోత్తంరెడ్డి, గోపాల్, శ్రీనుల మధ్య వివాదం నడుస్తోంది. తరచూ ఘర్షణ పడుతున్నారు. పోలీసుల ముందే గోపాల్, శ్రీనుల వర్గీయులు పురుషోత్తమ్‌రెడ్డి వర్గీయులపై దాడికి దిగారు. ఇరువర్గాలను పోలీసులు సముదాయించినా వినలేదు. దీంతో ఎస్సై కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

చేవెళ్ల, మే 4: మండల పరిధి కుమ్మెర గ్రామంలోని పొలాల వద్ద ఉన్న చెట్టు కింద గుర్తు తెలియని మృతదేహం లభ్య మైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మెరలో పొలాల వద్ద చెట్టు కింద ఓ పురుషుడి మృతదేహాన్ని గుర్తిం చిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి పోసులు వె ళ్లి పరిశీలించారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు ఉత్తరాది వాడిగా, మతిస్థిమితం లేక తిరిగి ఎండలకు తాళలేక చనిపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశామని ఎస్సై ప్రదీప్‌కుమార్ చెప్పారు.


పాల్మాకుల వద్ద రోడ్డు పక్కన శవం లభ్యం

శంషాబాద్ రూరల్ : గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైన సంఘటన శనివారం శంషాబాద్ మండలం పాల్మాకుల వద్ద హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి పక్కన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహం పడి ఉందని సమాచారం రాగా పోలీసులు వెళ్లి పరిశీలించారు. మృతుడు బిక్షాటన చేసే వ్యక్తిగా అనుమానిస్తున్నారు. ఒంటిపై గాయలు లేవు. వడదెబ్బ తగిలి మృతి చెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యాన్ని భరించలేక వ్యక్తి బలవన్మరణం

శంషాబాద్, మే 4 : శంషాబాద్ పట్టణ రాళ్లగూడ బస్తీకి చెందిన శ్రీనివాస్‌రెడ్డి(37) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధడేవాడు. రెండు రోజుల క్రితం ఇంటినుంచి ఎటో వెళ్లిపోయాడు. కుటుంబీకులు అతడి కోసం వెతుకగా శనివారం గ్రామ శివారులోని పోర్టు గ్రాండ్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీహెచ్‌ఎం సైదులు సేవలు చిరస్మరణీయం



సైదులు దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్న శిష్యులు

అచ్చంపేట, మే 4 : నల్లమల ప్రాంతంలో ఎంతోమందికి హిందీలో శిక్షణ ఇచ్చి ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన జీహెచ్‌ఎం సైదులు సేవలు చిరస్మరణీయమని ఆయన శిష్యులు సాజిద్, రూప్లానాయక్, బసవయ్య, శ్రీనివాసులు, నాగేశ్వరరావు కొనియాడారు. శనివారం నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట బస్టాండ్ సమీపంలో గల అన్నపూర్ణ ఫంక్షన్ హాల్‌లో సైదులు దశదినకర్మ నిర్వహించారు. ఉపాధ్యాయులు, మేధావులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అచ్చంపేట ప్రాంతంలోని వివిధ పాఠశాలల్లో పనిచేసి విద్యార్థులకు మంచి శిక్షణ ఇవ్వడంతో పాటు హిందీ అంటే మక్కువ ఉన్న విద్యార్థులను ఆయా కోర్సుల్లో ప్రోత్సహించి మంచి ఫలితాలు రావడానికి కృషిచేశారని కొనియాడారు.

అవేర్ సంస్థ సేవలు అభినందనీయం



మహేశ్వరం, మే 4 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అవేర్ సంస్థ సేవలు అభినందనీయమని పెండ్యాల మాజీ సర్పంచ్ సంధ్య అన్నారు. శనివారం గ్రామంలో అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సంధ్య మాట్లాడుతూ గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ ఎంతోమంది పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న అవేర్ సంస్థ సేవలు గొప్పవన్నారు. కార్యక్రమంలో అవేర్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ నారపంగ వెంకన్న పాల్గొన్నారు.